# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-07-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ఆధ్యాత్మికత అవసరమన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటలో ఈ రోజు జరిగే రుణమేళా కార్యక్రమంలో పాల్గొననున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.**

3. **క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించిన కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిన్న పాల్గొన్నారు. వెంకటపాలెం వద్ద సంప్రదాయ క్రతువు ప్రకారం బంగారు చీపురుతో రథం ముందు శుభ్రపరిచి రథయాత్రను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడిని తగ్గించి ప్రశాంతతను అందించేది ఆధ్యాత్మికతేఅని అన్నారు. ప్రతి ఏడాది అమరావతిలో జగన్నాథ రథయాత్రను నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ 30 సెకన్లు

---------------------------

టీజీ--20 లీగ్ విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ--ఛాంపియన్స్ జట్టు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని నిన్న మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ముఖ్యమంత్రి అభినందించి నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక క్రీడా విధానాన్ని తీసుకొచ్చామని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామని చెప్పారు. క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించామని, క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని, గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో నిర్మాణంలో ఉన్న శంకర్ విలాస్ పైవంతెన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో పైవంతెన నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను త్వరలోనే పరిష్కరించి, నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని చెప్పారు. ఈ వంతెన పూర్తయితే గుంటూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ 28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే రుణమేళా కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు పాల్గొంటారు. ఈ సందర్భంగా నరసరావుపేటలోని కోడెల శివప్రసాద్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు నిన్న పరిశీలించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రజల భద్రతతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలమనేరు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అడవి ఏనుగును విజయవంతంగా పట్టుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి అభినందించారు. దాదాపు నెల రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో డ్రోన్లు, కెమెరాలు, ఐదు కుంకీ ఏనుగుల సహాయంతో ఏనుగును సురక్షితంగా బంధించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. బిజెపి రాష్ట్ర నాయకులతో కలిసి పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రాజెక్టు పనులు ఇప్పటికే 89 శాతం పూర్తయ్యాయని చెప్పారు. గోదావరి--నాగావళి నదుల అనుసంధానాన్ని కూడా అమలు చేస్తామని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు గుర్తింపు ఆధారంగా వివక్షకు గురికాకుండా శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురానుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ బిల్లు--2026 రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమావేశమైంది. సమావేశం అనంతరం ఉపముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రోహిత్ వేముల వంటి ఘటనలు పునరావృతం కాకుండా వివక్ష రహిత విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ బిల్లును రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం

బిల్లును త్వరలోనే శాసనసభలో ప్రవేశపెడతామని తెలిపారు.

---------------------------

విజయనగరం జిల్లాను ఆంధ్రప్రదేశ్ లోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విజయనగరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. జలధార--జలహారతి కార్యక్రమం ద్వారా జిల్లాలో భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడిందని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

ఢిల్లీలో జరుగుతున్న భారత్ టెక్స్--2026 అంతర్జాతీయ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ లేపాక్షి పెవిలియన్‌ను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తుందన్నారు. లేపాక్షి పెవిలియన్‌కు దేశీయ, అంతర్జాతీయ కొనుగోలుదారుల నుంచి 120కి పైగా వ్యాపార విచారణలు వచ్చినట్లు వెల్లడించారు. కళాకారులకు మరిన్ని మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ చేనేత, హస్తకళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఎస్. సవిత తెలిపారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా--పశ్చిమ బెంగాల్ తీరాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తాంధ్ర నుంచి తెలంగాణ, మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో ఈ రోజు మేఘావృత వాతావరణంతో పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను ఆహార శుద్ధి పరిశ్రమ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఫుడ్ వరల్డ్ ఇండియా--2026 సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉందన్నారు. సుదీర్ఘ తీరప్రాంతం, రేవులు, విమానాశ్రయాలు, ఫుడ్ పార్కులు, కోల్డ్ స్టోరేజ్ వంటి మౌలిక వసతులతో పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని మంత్రి పేర్కొన్నారు.

=====================